క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ప్రకృతి పీఠం అధ్యక్షుడికి అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని ఎం.గోవిందిన్నె మెట్ట వద్ద ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన ఓ అజ్ఞాత దాత గురువారం విరాళం అందజేశారు. పంచమహా యజ్ఞముల ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ. 30 వేలు విరాళం ఇవ్వగా ఆ మొత్తాన్ని దాత అనుచరులు ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డికి అందజేశారు. రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సత్యమన్న పాల్గొన్నారు.

20న ఆలయ పొలాల కౌలుకు వేలం

ప్యాపిలి: పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన పొలాలను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 20వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్యాపిలి-1 గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి హనుమంతరావు గురువారం తెలిపారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 179లో 13.19 ఎకరాలు, 539లోని 5.33 ఎకరాలు, 436లోని 0.48 ఎకరాలు, 548లోని 5.33 ఎకరాలు, 607లోని 1.02 ఎకరాలకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించాలన్నారు. చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యాపిలి: మండలంలో 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు ఉచితంగా టైలరింగ్ శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన మహిళలు టైలరింగ్ శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వం మండల కేంద్రంలో మూడు విధాలుగా అనగా 45 రోజులు, 60 రోజులు, 90 రోజులు స్కిల్ ట్రెనింగ్ సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తుందన్నారు. 75 శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేస్తుందన్నారు.

పీఎంఏవై గృహాలకు అదనపు సాయం

ప్యాపిలి: ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద మంజూరైన గృహాల్లో అసంపూర్తిగా ఉన్న వాటికి ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందజేస్తుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న గృహాల లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత సచివాలయంలో అందించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

18న జాబ్‌మేళా

డోన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం తన కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అమిత్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, రాజా బ్యాగ్స్, డైకిన్ ఎయిర్ కండీషన్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు మేళా జరుగుతుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 9542643747, 7981238237 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో ఈనెల 9న పొలం వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. చింతలాయిపల్లె 144/1 సర్వే నంబర్‌కు చెందిన 3 ఎకరాల భూమి విషయంలో గ్రామానికి చెందిన దూదేకుల ఇమాంబి, అంకిరెడ్డిపల్లెకు చెందిన బత్తుల వరలక్ష్మిదేవి కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుని గొడవ పడ్డారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

డేంజల్ బెల్స్

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- రైతన్నకు సాగు కష్టాలు
- ఆశ వదులుకోలేక బోర్లు వేస్తున్న అన్నదాతలు
- పంటలు కాపాడుకునేందుకు పాట్లు

కొలిమిగుండ్ల: వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వ్యవసాయ బోర్లలో నీరు తగ్గుముఖం పడుతోంది. వస్తున్న అరకొర నీరు పొలాలకు పారడం లేదు. బోర్లు ఎండిపోతుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎండలు సైతం రోజు రోజుకు మండిపోతున్నాయి. పంటలు చేతికొచ్చే దశలో నీరందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బనగానపల్లె నియోజవర్గంలోని అవుకు, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాలకు రిజర్వాయర్, సాగు నీటి కాల్వలు ఉండడంతో అక్కడి రైతులు పంటలు పండించుకుంటున్నారు. అయితే కొలిమిగుండ్ల మండలంలో సాగు నీటి వనరులు ఏమాత్రం లేవు. బోరు బావులు, వర్షాధారం కింద మాత్రమే పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి. ఏటా లోటు వర్షపాతం నమోదవుతుంటుంది. ప్రస్తుతం బోర్లలో గంగమ్మ పాతాళానికి చేరుకుంది. అబ్దులాపురం, కోర్నపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె, మదనంతపురం తదితర గ్రామాల్లో అరటి, చీని, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలను బోర్ల కింద సాగు చేస్తున్నారు. పంటలు మధ్యలో ఉన్న సమయంలో ఉన్నట్లుండి బోర్లలో నీళ్లు తగ్గిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దిగుబడి చేతికొచ్చే వరకు నీళ్లు సరిపోయే అవకాశాలు ఉండవని దిగాలు చెందుతున్నారు.



అబ్దులాపురంలో వ్యవసాయ బోరు నుంచి తక్కువ మోతాదులో వస్తున్న నీరు

ఆశతో బోర్ల తవ్వకాలు

ఉన్న బోర్లలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. సాగులో ఉన్న పంటలను ఎలాగైనా దక్కించుకోవాలనే ఆశతో రైతులు కొత్తగా బోర్ల మీద బోర్లు తవ్విస్తున్నారు. అయినా వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. కొత్త బోర్లలో కూడా గంగమ్మ పైకి రానని భీష్మించుకుంది. కోర్నపల్లెకు చెందిన రైతు పులి పెద్దిరెడ్డి 17 ఎకరాల్లో అరటి, చీని సాగు చేశాడు.. ఉన్న ఆరు బోర్లలో నీళ్లు తగ్గి పంటలకు సరిపడకపోవడంతో ఐదు రోజుల క్రితం 500 అడుగులు తవ్వించి బోరు వేశాడు. కేవలం ఒక ఇంచు మాత్రమే నీళ్లు పడ్డాయి. వాటితో పంటకు నీళ్లు పారించడం కష్టంగా ఉంటుందని రైతు పేర్కొన్నాడు. చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు లేక వేలాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేస్తున్నా ఫలితం దక్కడం లేదు. దీంతో పెట్టుబడులు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారు.

దిక్కుతోచడం లేదు



రెండు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. బోరులో అమాంతం నీళ్లు తగ్గాయి. ఇప్పుడు కొళాయిలో వచ్చినట్లు బోరు నుంచి నీళ్లు వస్తున్నాయి. వాటి ద్వారా పంటకు నీళ్లు సరిగా అందడం లేదు. ఇంకా రెండు నెలల పాటు పంటను కాపాడుకోవాలి. నీళ్లు లేకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతెలియడం లేదు.

–దస్తగిరి, రైతు, కోర్నపల్లె

ఒక్క రోజులోనే మార్పు వచ్చింది



ఎకరన్నర కౌలుకు తీసుకుని మొదటిసారిగా పెసర పంట సాగు చేశాను. బోరులో ఒక రోజులోనే నీళ్లు తగ్గడం మొదలయ్యాయి. ఈ పరిస్థితి చూస్తే రోజు రోజుకు భూగర్భ జలాలు పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల వరకు నీళ్లు పారితే పంటను కాపాడుకోవచ్చు. లేక పోతే ఎండిపోయే ప్రమాదముంది.

–పెద్దయ్య, కౌలు రైతు, అబ్దులాపురం

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

కోవెలకుంట్ల: ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగానికి స్వస్తి చెప్పి ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి సూచించారు. గురువారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించండి-పునర్వినియోగాన్ని ప్రోత్సహించండి' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మైక్రోప్లాస్టిక్ మెదడులోకి వెళ్లి అనేక మానసిక, శారీరక రుగ్మతలకు కారణం అవుతుందన్నారు. మనం తీసుకునే ఆహారం ప్లాస్టిక్‌తో కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, రాజశేఖర్, లక్ష్మిదేవి, అన్నపూర్ణ, సుభాష్‌రెడ్డి, సంటిరెడ్డి, రమణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు పాల్గొన్నారు.

కంపమల్లలో పోలీస్ పికెట్

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లలో గురువారం నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ సోముల లోకేశ్వరరెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన 9 మంది టీడీపీ నాయకులతో పాటు మరికొందరిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో తిరిగి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా రేవనూరు ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో ముగ్గురు కానిస్టేబుళ్లతో పికెట్ కొనసాగుతోంది. పికెట్‌ను కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు.

దాడి ఘటనపై వివరాల సేకరణ

మండలంలోని కంపమల్లలో వైఎస్సార్‌సీపీ నేత లోకేశ్వరరెడ్డిపై బుధవారం రాత్రి జరిగిన దాడి ఘటనపై గురువారం పోలీసు అధికారులు వివరాలు సేకరించారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకుని వైఎస్సార్‌సీపీ నేత ఇంటి వద్ద జరిగిన దాడి వివరాలపై ఆరా తీశారు. దాడికి గల కారణాలు, ఇతర వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఏళ్ల నుంచి ప్రశాంతంగా ఉన్న గ్రామంలో భయానక దాడి సంఘటన చోటు చేసుకోవడంలో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



గ్రామంలో గొడవలు జరగకుండా పోలీసు పికెట్

జాబ్‌మేళాలో 38 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 38 మంది ఉద్యోగాలు పొందినట్లు వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఫాక్స్‌కాన్, యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మాలవికాస డెవలపర్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. మొత్తం 60 మంది అభ్యర్థులు హాజరు కాగా ఆయా కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 38 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి హైదరాబాద్, కడప, తిరుపతి, నంద్యాల, పాణ్యం, అవుకు ప్రాంతాల్లో ఉద్యోగాలు కేటాయిస్తారన్నారు. అనంతరం అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఆ సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణదాసు, కృష్ణ శశాంక పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల: ఇంటి పన్నులు, నీటి పన్నులు సకాలంలో చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ హరిప్రసాద్ పట్టణ ప్రజలకు సూచించారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. పన్నుల వసూళ్ళ, నగర పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పొలం స్వాధీనానికి యత్నంపై ఫిర్యాదు

ప్యాపిలి: మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలోని తమ 4.3 ఎకరాల పొలాన్ని అదే గ్రామానికి చెందిన పిక్కిలి రామాంజనేయులు కుటుంబీకులు స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని మహబూబ్ బాషా వాపోయాడు. గురువారం తన కుటుంబంతో కలిసి వచ్చి తహసీల్దార్ భారతికి ఫిర్యాదు చేశాడు. మునిమడుగు గ్రామంలో సర్వే నంబర్ 108–3లో తమ పేరిట ఉన్న 4.3 ఎకరాల పొలాన్ని 15 ఏళ్లుగా సాగు చేస్తున్నామని తెలిపారు. ఈ పొలం వివరాలు అడంగల్‌లో పిక్కిలి రామాంజనేయులు, పిక్కిలి మహేశ్వరమ్మ పేరుతో నమోదైనట్లు తెలిపారు. పిక్కిలి రామాంజనేయులు మృతి చెందాడని..కానీ అతని కుటుంబీకులు తమను బెదిరిస్తున్నారని వాపోయారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.



తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధిత కుటుంబీకులు

వేలంపాట వాయిదా

డోన్: మున్సిపాలిటీ పరిధిలో దిన, వారపు సంతలతో పాటు జంతు వధశాల, బస్టాండ్ రుసుం వసూలు చేసేందుకు గురువారం జరగాల్సిన వేలం పాటకు కాంట్రాక్టర్లు హాజరుకాకపోవడంతో వాయిదా పడింది. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటు ఏర్పాటు చేయగా గురుస్వామి అనే వ్యక్తి తప్ప ఎవరూ పాల్గొనలేదు. దీంతో వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. గత ఏడాది జులై మాసం నుంచి ఫిబ్రవరి వరకు వారపు సంత రూ.2 లక్షలు, దినసరి సంత రూ.6లక్షలు, బస్టాండ్ రుసుం రూ.7లక్షలు, జంతు వధశాల రూ.లక్ష చొప్పున కాంట్రాక్టర్లు దక్కించుకున్న విషయం తెలిసిందే.



వాయిదా వేసినట్లు ప్రకటిస్తున్న కమిషనర్ ప్రసాద్‌గౌడ్

సాయిబాబా ఆలయంలో మాసోత్సవ పూజలు



బాబాను దర్శించుకుంటున్న భక్తులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రారంభించి నెల కావడంతో మాసోత్సవ పూజలు చేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం అందించారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

బనగానపల్లె రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ బీవీ రమణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 15న జరగనున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అపరిశుభ్రత లేకుండా చూడాలని సూచించారు. ఎంఈఓ స్వరూప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి

బనగానపల్లె రూరల్: కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని విగ్రహం వద్ద నియోజకవర్గ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, రాజేశ్వరి, లక్ష్మీప్రసన్న, లక్ష్మీ, సరోజ, శ్వేతా, ప్రసన్న, బాబాయ్య, శివరామ్, నాగరాజు, సుబ్బయ్య, మద్దిలేటి, మనోహర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లైంగిక నేరాలకు కఠిన శిక్షలు

డోన్ టౌన్: బాలికలపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. పాతపేట ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం లైంగిక నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారని.. కఠిన శిక్షలు అమలవుతాయని తెలిపారు. బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం సరస్వతి పూజలో పాల్గొన్నారు. సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి తంగమణి

రిటైర్డు వీఆర్వో మృతి

డోన్: పట్టణానికి చెందిన రిటైర్డ్ రెవెన్యూ అధికారి(వీఆర్వో) కుమారస్వామిగౌడ్(70) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. డోన్‌లో 30 ఏళ్ల పాటు పనిచేసిన ఆయన మృతిపై ఆర్టీఓ రంగనాయకులు,తహసీల్దార్ నాగమణి, ఆర్ఐ మస్తాన్, రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

ఆకుమల్ల టీడీపీలో భగ్గుమన్న వర్గవిభేదాలు

సంజామల: ఆకుమల్ల సంత మార్కెట్ స్థల విషయంలో టీడీపీలో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసే కూరగాయల మార్కెట్ స్థల విషయంలో ఓ వర్గం పాఠశాల సమీపంలో ఏర్పాటు చేయాలని, మరో వర్గం ఊరిలో ఏర్పాటు చేయాలని పట్టుబట్టాయి. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఊరిలో ఏర్పాటు చేయాలని గురువారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, సర్పంచ్ వెంటయ్య ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుండగా ఇరువర్గాలు వ్యక్తిగత దూషణలకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో గ్రామ సభను వాయిదా వేశారు.



సచివాలయం వద్ద దూషించుకుంటున్న ఇరువర్గాలు

ప్రిన్సిపాల్‌పై ఆర్‌జేడీ ఆగ్రహం

డోన్ టౌన్: ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ సక్రమంగా విధులు నిర్వహించకుంటే ఎలా అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతిపై కళాశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగలింగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ పుస్తకాలపై జరుగుతున్న తనిఖీలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీకి తరగతి గదిలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు పొంతన లేకపోవడం, తరగతుల వారీగా బోధన చేసిన అధ్యాపకుల వివరాలు, వారి సంతకాలు లేకపోవడంపై ప్రశ్నించారు. కాగా ప్రిన్సిపాల్ భారతి రూ.5 లక్షల నిధులను అక్రమంగా వాడుకున్నారని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో చేసిన పనులను కళాశాల నిధుల నుంచి చేసినట్లు చూపించినట్లు ఆరోపించారు.



రికార్డుల్లో తేడాలపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న ఆర్‌జేడీ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు మెట్టుపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నపరెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం పరీక్షల కిట్‌ను ఉచితంగా అందజేశారు. హెచ్ఎంలు సునంద, వెంకటనాయక్, ఉపాధ్యాయులు పవిత్రన్ రావు, పురుషోత్తం పాల్గొన్నారు.

సారా విక్రేతల బైండోవర్



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి

అవుకు: నాటుసారాతో జీవితాలు నాశనం అవుతాయని.. వాటికి దూరంగా ఉండాలని బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి అన్నారు. గురువారం అవుకు మండలం కొండమనాయునిపల్లె, పిక్కర్లపల్లితండా, ఇస్రానాయక్ తండా గ్రామాల్లో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. ఆయా గ్రామాల్లో సారా అమ్ముతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

కోవెలకుంట్ల: పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చివరి రోజు నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 249 మంది హాజరుకావాల్సి ఉండగా 238 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. అలాగే అంబేడ్కర్ గురుకుల కళాశాల పరీక్ష కేంద్రంలో 188 మందికి గాను 178 మంది హాజరైనట్లు చీఫ్ సూపర్‌వైజర్ ఉమాదేవి చెప్పారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

డోన్ టౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 17 నుంచి మే 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని వెల్లడించారు.

నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం



పాఠశాల ముస్తాబు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె ప్రాథమిక పాఠశాల భవనం రంగు రంగులతో అందంగా ముస్తాబైంది. గతంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద రూ.16 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో పాత తరగతి గదిని కూలదోసి కొత్తగా నిర్మించారు. భవన నిర్మాణంతో పాటు ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం కల్పించారు. అదానీ సిమెంట్ కంపెనీ పాఠశాల భవనానికి రంగులతో పా టు బొమ్మలు వేయించడంతో కొత్త కళను సంతరించుకుంది. విద్యార్థుల సౌకర్యార్థం టాయ్‌లెట్ల నిర్మాణం సిమెంట్ కంపెనీ చేపట్టింది. ఎట్టకేలకు భవనం పూర్తి కావడంతో విద్యార్థులకు తరగతి గది కష్టాలు తప్పనున్నాయి.

రోడ్డుపై నిలిచిన వాహనాలు



ఆస్థానం రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లు

బనగానపల్లె: పట్టణంలోని ఆస్థానం రోడ్డులో తరచూ ట్రాఫిక్ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.పోస్టాఫీస్ కార్యాలయం నుంచి ఆస్థానం వరకు దుకాణాల ముందు బైక్‌లు పార్కింగ్ చేస్తుండడంతో భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీనికి తోడు దుకాణదారులు ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో నిత్యావసర సరుకులు తెప్పించుకుంటున్నారు. రోడ్డుపై గంటల తరబడి వాహనాలను ఆపి అన్‌లోడింగ్ చేస్తుండడంతో సమస్య జటిలమవుతోంది. ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేరుసోముల ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు



అంతా చెత్తమయం

సంజామల: గ్రామాలు చెత్తమయంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ్య పనులు అటకెక్కాయి. మండల పరిధిలోని పేరుసోముల గ్రామ బస్టాండ్ ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అంతేకాకుండా చెత్తకుప్పలకు నిప్పుపెట్టడంతో దుర్గంధంతో పాటు పొగతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.